క్లుప్తంగా

రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: మనం చేసే రక్తదానం ప్రమాద సమయంలో బాధితులకు ప్రాణం పోస్తుందని వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, వెంకట రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు కల్కి సతీష్ సహకారంతో గర్భిణులు, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణంలోని యువకులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు రక్తదానం చేశారు. మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా గోపాలు, కంద గడ్డల జనార్దన్, బచ్చు సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఐటీఐలో ముగిసిన ప్రవేశాలు



ప్రవేశాలకు హాజరైన విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, వెల్డర్, కోపా ట్రేడ్‌లకు సంబంధించి 152 సీట్లకు గాను 238 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 10వ తరగతి మార్కుల ఆధారంగా వంద శాతం ప్రవేశాలను పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు

కోవెలకుంట్ల: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు సూచించారు. బుధవారం రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో శక్తిటీం ఏఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

సత్కారం



బీజేపీ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బీజేపీ రాష్ట్ర నాయకుడు సోముగుంట విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టవంశీ, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, అంకాల రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థి పనతల సురేష్‌ను బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సత్కరించి ఛత్రపతి శివాజీ ప్రతిమను అందజేశారు. కమలేష్, ముదిరాజ్, లక్ష్మీనారాయణ, వీరేష్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



పట్టణంలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్ బాబు

బేతంచెర్ల: మీ కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని ఎస్‌ఐ రమేష్ బాబు సూచించారు. బుధవారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు సరిగా లేని వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. పట్టణంలో నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని చెప్పారు.

డెంగీ కేసు నమోదు

ప్యాపిలి: మండలంలోని మాధవరం గ్రామంలో మూడేళ్ల బాలుడికి రెండు రోజుల క్రితం డెంగీ జ్వరం నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం బాలుడు కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకుంటున్నాడు. డెంగీ కేసు వెలుగు చూడటంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్ సూచించారు.

ముదిగేడు గొంతెండుతోంది!

- ముదిగేడు ఎస్సీ కాలనీలో నీటి కష్టాలు
- ఏడాదైనా పరిష్కారం చూపని అధికారులు



ముదిగేడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామం ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు లైన్‌లకు అస్సలు నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేకపోవడంతో తాగు నీటి కోసం తంటాలు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే లేరని కాలనీ వాసులు వాపోతున్నారు. పనులు మానుకుని పక్క కాలనీలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లేకపోవడంతోనే..

ఎస్సీ కాలనీలో దాదాపు 40 కుటుంబాలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.15 లక్షలతో ఎస్సీ కాలనీ వాసుల కోసం పైపులైన ఏర్పాటు చేయించి ఇంటింటికి కుళాయి బిగించి తాగు నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులు పర్యవేక్షణ మరిచిపోవడంతో సిబ్బంది పైపులైన్ నిర్వహణను గాలికొదలడంతో చెత్తచెదారం చేరి నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. ఇదే విషయాన్ని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. అధికారులు స్పందించకపోతే ఎంపీడీఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామని మహిళలు హెచ్చరిస్తున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ సాల్మన్‌ను వివరణ కోరగా ఎస్సీ కాలనీకి నీరు సరఫరా కావడం లేదని సమాచారం అందిందని, సమస్యను పరిష్కరించాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించామని చెప్పారు.

పక్క కాలనీలో తెచ్చుకుంటున్నాం

మా కాలనీకి చాలా రోజుల నుంచి తాగు నీరు రావడం లేదు. పక్క కాలనీకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. కొన్ని సార్లు పక్కకాలనీలో కూడా నీరు తక్కువగా వస్తున్నపుడు బస్టాండ్ ఏరియాకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. గ్రామం మొత్తం నీరు వస్తున్నా మా కాలనీకి మాత్రమే రావడం లేదు.

– లక్ష్మీదేవి, ముదిగేడు గ్రామం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

దాదాపు ఏడాది నుంచి మా కాలనీకి నీరు రావడం లేద. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతి ఇంటికి కుళాయి ఉంది. నీరు మాత్రం రావడం లేదు. పక్క బజారుకు పోయి నీళ్లు తెచ్చుకుంటున్నాం.

– కిట్టు, ముదిగేడు గ్రామం

పాఠశాలకు బీరువా విరాళం

డోన్: మండలంలోని దొరపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలకు రూ.10వేల విలువజేసే బీరువాను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శకుంతల రెడ్డి, కార్యదర్శి విజయమ్మ బుధవారం హెచ్‌ఎం ఉమాగణేష్‌కు అందజేశారు. మాజీ అధ్యక్షురాలు ముడియాల శైలజారెడ్డి, శారదాదేవి, సభ్యులు అనురాధ, మర్రి సరళాదేవి, రాజా సుజాత పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదు

బేతంచెర్ల: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని వైద్యుడు అలీమ్ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ (ఎయిడ్స్)పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి భారిన పడిన వారి వివరాలు గోప్యంగా ఉంచడమే కాకుండా ఉచిత పరీక్షలతో పాటు మందులు అందజేస్తామని చెప్పారు.

సీసీ కెమరాల ఏర్పాటుకు రూ.4లక్షల విరాళం



విరాళాల చెక్కును డీఎస్పీకి అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలో శాంతి భద్రతల పరి రక్షణ కోసం నిఘా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ఉపయోగించే అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు డోన్ మైన్స్, పల్వరైజర్స్ అసోసియేషన్ వారు విరాళాలు అందజేశారు. బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్‌ను స్థానిక కార్యాలయంలో కలిసి మైన్ ఓనర్స్ అసోసియేషన్ నుంచి రూ.3 లక్షలు, పల్వరైజర్స్ సంఘం తరపున రూ. లక్ష విరాళాలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ సొమ్ముతో పట్టణంలో పలు చోట్ల అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను 24 గంటల పర్యవేక్షించేందుకు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐలు ఇంతియాజ్‌బాషా ,సీఎం రాకేష్‌తో పాటు మైన్ ఓనర్లు,పారిశ్రామికవేత్తలు ఉన్నారు.

జయప్రదం చేయండి

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా సీపీఐ పార్టీ రెండవ మహాసభను విజయవంతం చేయాలని మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు షణ్మూర్తి, ప్రధాన కార్యదర్శి సుంకయ్య, కోశాధికారి రాధాకృష్ణ, మండల, పట్టణ కార్యదర్శులు నారాయణ,మోటా రాముడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి మహా సభల ప్రణాళికను వివరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ జెడ్పీ గెస్ట్ హౌస్ నుంచి 11 గంటలకు ర్యాలీగా పాత బస్టాండ్ వరకు ఉంటుందన్నారు. సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ,రాష్ట్ర సహాయ కార్యదర్శి ముపాళ్ళ నాగేశ్వరరావు తదితరులు హాజరవుతారని చెప్పారు. పార్టీ శ్రేణులు,ప్రజా సంఘాల నాయకులు,రైతులు,కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ప్రభాకర్,పులిశేఖర్,కోయిలకొండ నాగరాజు, ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధువరులుగా ముస్తాబు చేసి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీశైలంలో ఉచిత యోగా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన పరిధిలోని చంద్రవతి కల్యాణ మండపంలో బుధవారం రెండో రోజు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఒంగోలుకు చెందిన యోగా గురువు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం హాజరై భక్తులు, సిబ్బంది, స్థానికులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన వై.సీతారామరాజు భాగవతార్.. భూకై లాస్ హరికథాగానం నిర్వహించారు. తబలా సహకారాన్ని ఎం.వెంకటేష్, హార్మోనియం సహకారాన్ని వై.జగదీష్ అందించారు.

భవనాల స్థితిగతులు తెలియజేయాలి

పాములపాడు: పాఠశాల భవనాలు, మౌలిక వసతులు, తరగతి గదిలో విద్యార్థులు కూర్చునే బల్లల స్థితి గతులను తెలియజేయాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ సుభాషిణీ దేవి, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి

వెలుగోడు: స్థానిక రెడ్డి గారి వీధిలో వెలసిన చౌడేశ్వరి దేవి జయంతిని గురువారం భక్తిశ్రద్ధల తో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు యాగంటి రవీంద్రుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉదయం 8 నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామావళి, దేవి ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని అలంకరించి పల్లకీలో వుంచి ఆలయ ప్రదక్షిణ ఉత్సవం నిర్వహించనున్నామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నామన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

సర్వేయర్‌పై ఫిర్యాదు

డోన్ టౌన్ : తమను కుల వివక్షతో దూషించిన మండల సర్వేయర్ జగదీష్‌పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని మండలంలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన నాగన్న, మదన్ మోహన్, కిష్టన్నతో పాటు మరికొందరు బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అయితే తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని సర్వేయర్ జగదీష్ మంగళవారం కొందరిపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

విద్యార్థుల మధ్య ఘర్షణ

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి ఓ విద్యార్థి గాయపడిన విషయం రెండు రోజులు ఆలస్యంగా వెలుగు చూసింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు ముగ్గురు సోమవారం పాఠశాల సమయంలో గొడవ పడ్డారు. దీంతో ఓ విద్యార్థి కాలికి గాయమైంది. పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో విచారణ జరిపారు.

పీ4పై అవగాహన

డోన్: పట్టణంలోని 13, 14 సచివాలయాల పరిధిలో పీ4పై అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పీ4లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి సచివాలయాల స్పెషల్ ఆఫీసర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లకు వివరించారు.

నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థానంలో జరిగిన హుండీ చోరీ కేసులో నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26వ తేదీ ఎగువ అహోబిలం దేవాలయంలో సిబ్బంది కొందరు హుండీ దొంగతనానికి పాల్పడినట్లు దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనపై విచారించి అందులో ఉద్యోగం చేస్తున్న అరిగెల నరసింహ, రంపాల సుబ్బరాయుడు, కరణం నిరంజన్, నెమ్మెకంటి పోతులూరయ్య అనే నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 82 వేలు నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

నంద్యాల(అర్బన్): గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన ప్రసాదరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసాదరెడ్డి బుధవారం ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి జొరబడి దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసమైందని, పోలీసుల సహకారంతో ప్రసాదరెడ్డిని ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై రూరల్ సీఐ ఈశ్వరయ్య వివరణ కోరగా తనకు ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జీసీ పాలెం గ్రామానికి చెందిన మాధవ స్వామి వద్ద నుంచి బుధవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మాధవస్వామి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి అతని వద్ద నుంచి 11 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



ఇబ్బందికరంగా ఉన్న స్పీడు బ్రేకర్లు



స్పీడు బ్రేకర్‌ను దాటే క్రమంలో కిందపడి పగిలిపోయిన గుడ్లు

స్పీడు బ్రేకర్లను తొలగించరూ!

బేతంచెర్ల: పట్టణంలోని సత్రం నుంచి కొలుముల పల్లె నీళ్ల ట్యాంకు వరకు ఉన్న 800 మీటర్ల రహదారిలో 8 స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ఆ రహదారి గుండా వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో వేసిన స్పీడు బ్రేకర్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర పంచాయతీ వార్డు కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్స్, చైర్మన్ చలం రెడ్డి సమస్యను లేవనెత్తారు. కమిషనర్ హరి ప్రసాద్ స్పీడు బ్రేకర్లను తొలగిస్తామని సమాధానం ఇచ్చారు. సమావేశం పూర్తయి 25 రోజులు గడిచినా స్పీడు బ్రేకర్లు తొలగించకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇటీవల స్పీడు బ్రేకర్లను దాటే క్రమంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఉన్న గుడ్లు కిందపడి పగిలిపోయాయి.

ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం



ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్, ఏఓ జ్యోతి

సంజామల: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని కోవెలకుంట్ల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నొస్సం గ్రామ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. పండ్ల తోటలు-ఆయిల్ పామ్ తోటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా డ్రిప్ వాడాలని ఆయన సూచించారు. ఉద్యాన పంటలు సాగు చేసిన తర్వాత అంతర్ పంటలుగా వరి తప్ప మిగిలిన పంటలు ఏవైనా సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ మొక్కలు రైతులకు అందిస్తామని, ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా నూతన ప్రాంతీయ చైర్మన్‌గా సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డి

నంద్యాల (వ్యవసాయం): లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్రాంతీయ చైర్మన్‌గా నంద్యాల లయన్స్ క్లబ్‌కు చెందిన పీవీ సుధాకర్ రెడ్డిని ఎంపిక చేశారు. సుధాకర్ రెడ్డి గత సంవత్సరం జోనల్ చైర్మన్‌గా, 2023-24 సంవత్సరంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన విశేష సేవలను గుర్తించి ప్రాంతీయ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు లయన్స్ గవర్నర్ ఇల్లూరి గోపాలకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. నూతన ప్రాంతీయ చైర్మన్‌కు ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్‌ల సమాఖ్య మాజీ చైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ సహదేవుడు, ఆడిటర్ వంకదారి గోపాల్, భవనాసి నాగ మహేష్, కొట్టి చంద్రశేఖర్, రవి ప్రకాష్, శ్రీకాంత్, ఎంపీవీ రమణయ్య, బైసాని రమేష్, మనోహర్ రెడ్డి, రవీంద్ర, అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్దన్ అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్ల నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, సెక్రటరీ నాగరాజుల ఆధ్వర్యంలో బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సుబ్బయ్య, అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, కార్యదర్శి రోజారమణి, కోశాధికారి సుజాత ఉపాధ్యక్షులుగా శశికళ, సుబ్బమ్మ, భాగ్యలక్ష్మి, సుకన్య, లక్ష్మీదేవి, సరస్వతి, పద్మావతి, సహాయ కార్యదర్శులుగా రామేశ్వరి శ్రీదేవి, హేమలత సుబ్బమ్మ, రేణుక, మల్లేశ్వరి, వరలక్ష్మితో పాటు మరో 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా సెక్రటరీ నిర్మలమ్మ పాల్గొన్నారు.

సౌభాగ్య పౌడర్ ప్యాకెట్ల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లు

కోవెలకుంట్ల: నిషేధిత సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లు విక్రయించే కిరాణాషాపులపై బుధవారం సీఐ హనుమంతునాయక్, ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. సుమారు 300 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన కెమికల్ పదార్థాలు ఉండటంతో పౌడర్‌ను నిషేధించినా పలు షాపుల్లో విక్రయాలు జరుపుతుండటంతో దాడులు జరిపారు. అనంతరం సీజ్ చేసిన ప్యాకెట్లను కాల్చివేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిషేధిత సౌభాగ్య పౌడర్ ప్యాకెట్లను విక్రయించవద్దన్నారు. వ్యాపారులు అమ్మకాలను కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

3న బహుజనుల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(న్యూటౌన్): ఆగస్టు 3వ తేదీన అనంతపురంలో బహుజన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆర్‌పీఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ తెలిపారు. బుధవారం నంద్యాలలో బహుజన రిజర్వేషన్ల ఎంప్లాయిస్ ఫెడరేషన్ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. రాజకీయ పార్టీల సామాజిక న్యాయం కేవలం ప్రకటనలకే పరిమితమన్నారు. 56శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 44శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు

మహానందీశ్వరుడి సేవలో..

మహానంది: మహానందీశ్వరుడిని బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సభ్యులు సంతోష్, సూర్య పరీదాలు దర్శించుకున్నారు. ముందుగా వారికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మల్లికార్జున స్వాగతం పలికారు. అనంతరం వారు కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.



కుందూకు జలకళ!

కోవెలకుంట్ల పట్టణ శివారులోని కుందూనదికి జలకళ వచ్చింది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ఇటీవల శ్రీశైలం జలాశయానికి వరదనీరు భారీగా చేరింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి అధికారులు కుందూకు నీటిని విడుదల చేయడంతో నది వరద నీటితో ప్రవహిస్తోంది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కుందూ పరివాహకంలోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో వరి, ఇతర ఆరుతడి పంటల సాగుకు నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వివిధ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. – కోవెలకుంట్ల